కళ్లెం వేయకపోతే.. కడుపు కోతే

● మితిమీరిన వేగంతో మైనర్ల బైక్ రైడింగ్


బైక్ నడుపుతున్న మైనర్లు

డోర్నకల్: పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ముగియడంతో యువత రోడ్డెక్కింది. ఒక్కో బైక్‌పై ముగ్గురు, నలుగురు చొప్పున కూర్చుని బైకులను పరుగులు పెట్టిస్తున్నారు. 18 సంవత్సరాలు కూడా నిండని మైనర్లు వీధుల్లో బైకులను వేగంగా నడుపుతుండడంతో రోడ్లపై వెళ్తున్న వారు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలో వీధులు ఇరుకుగా ఉంటున్నాయి. దీంతో రోడ్ల పక్కనే దుకాణాలతో వీధులు నిత్యం రద్దీగా మారుతున్నాయి. ఇరుకుగా ఉన్న వీధుల్లో యువకులు బైకులను వేగంగా నడుపుతూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పెద్ద శబ్దం వచ్చే సైలెన్సర్లను బైకులకు అమర్చి వేగంగా వెళ్తూ రోడ్లపై వెళ్లేవారిని ఇబ్బంది పెడుతున్నారు. మెయిన్ రోడ్డు, బ్యాంక్‌స్ట్రీట్, జెడ్పీ స్కూల్‌సెంటర్, పాతడోర్నకల్, బైపాస్ రోడ్డు, సుభాష్ వీధి, ఎస్సీ, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో యువకులు బైకులతో హల్‌చల్ చేస్తున్నారు. పాఠశాలలు నడిచే సమయాల్లోనూ యువకులు పాఠశాలల ముందు బైకులను వేగంగా నడుపుతూ ఫీట్లు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో యువకులు బైకులను వేగంగా నడిపి ప్రమాదాల బారిన పడి గాయాలపాలైన ఘటనలు చాలా ఉన్నాయి. ప్రధాన వీధుల్లో స్పీడు బ్రేకర్లు లేకపోవడం, మైనర్ల బైకు రైడింగ్‌ను నియంత్రించే వారు లేకపోవడంతో బైక్ రైడింగ్ రోజురోజుకూ పెరుగుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే తల్లిదండ్రులకు కడుపు కోతే మిగులుతుంది.

కేసులు నమోదు చేస్తాం..



మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం. ప్రధాన కూడళ్లలో పెట్రోలింగ్, వాహన తనిఖీ పెంచుతాం. తల్లిదండ్రులు తమ పిల్లకు వాహనాలు అందుబాటులో ఉంచరాదు. మైనర్లకు బైక్‌లు ఇస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ.

– బి.రాజేష్, సీఐ, డోర్నకల్

వరి కోతలు ఆలస్యం చేయొద్దు


వరి కోతపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

పెద్దవంగర: వరి పంట పక్వానికి వచ్చిన తర్వాతనే కోతల చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి స్వామి నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని అవుతాపురం గ్రామంలో రైతులకు, హార్వెస్టర్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వరి పొలంలో వెన్నులు పసుపు రంగులోకి మారినప్పుడు కోతలు ప్రారంభించాలన్నారు. కోతల ఆలస్యం అయితే ఎండకు గింజ పగుళ్లు వచ్చి ధాన్యం నూకలు అవుతాయని తెలిపారు. ధాన్యంలో తేమ 12నుంచి 14శాతం వచ్చే వరకు ఎండబోస్తే ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటుందని పేర్కొన్నాడు. అనంతరం మండల కేంద్రంతో పాటు గంట్లకుంట, పోచంపల్లి, రామచంద్రు తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ సీఈఓ మురళి, ఏపీఎం రమణాచారితో కలిసి సందర్శించారు.

పహల్గాం మృతులకు నివాళి


మహబూబాబాద్ రూరల్: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



మహబూబాబాద్ అర్బన్: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

మహబూబాబాద్ రూరల్/తొర్రూరు: కశ్మీర్‌లో యాత్రికులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సీనియర్ న్యాయవాది తుపిళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో జిల్లా కోర్టు న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. సానుభూతి ప్రకటించారు. ఈ నిరసన ర్యాలీలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జంగం సిద్ధార్థ, కోశాధికారి దూదికట్ల చిన్నమహేందర్, న్యాయవాదులు చిలుకమారి వెంకటేశ్వర్లు, కొండపల్లి కేశవరావు, దేశబోయిన వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్/డోర్నకల్: కశ్మీర్ పహల్గాంలో యాత్రికులపై కాల్పులు చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని మానుకోట జిల్లా వక్ఫ్ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కన్వీనర్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. జిల్లా వక్ఫ్ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కోర్టు సెంటర్ నుంచి నెహ్రూసెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, అడ్వైజర్ సభ్యుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ ఫరీద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మే నెలంతా వేసవి సెలవులు ఇవ్వాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

మహబూబాబాద్: మే నెలంతా వేసవి సెలవులు ఇవ్వాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి స్నేహబిందు డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా స్నేహబిందు మాట్లాడుతూ.. మే నెల మొత్తం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బకు పిల్లలు అస్వస్థతకు గురి అయ్యే అవకాశం ఉందన్నారు. విద్యాశాఖలో పాఠశాలలకు సెలవులు అమలు చేసి, అంగన్‌వాడీ కేంద్రాలకు వర్తింపజేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, సంపూర్ణ, కవిత, వీరలక్ష్మి, అండాలు, మల్లికాంబ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

డోర్నకల్: మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి ఈనెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డోర్నకల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణభాను తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 27న 6వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు, 7నుంచి 10వ తరగతి ప్రవేశాలకు మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి


అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నెహ్రూసెంటర్: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సమ్మె సన్నాహక సదస్సును గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.సూర్యం, ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కె.మధార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్ మాట్లాడారు. కార్మిక వ్యతిరేక, లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర మోదీ ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో మంద శంకర్, రవి, భాస్కర్‌రెడ్డి, లింగ్యా, రాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

అన్నప్రసాదం పంపిణీ



మహబూబాబాద్ రూరల్: భగవాన్ శ్రీసత్యసాయి బాబా వారి ఆరాధనోత్సవాన్ని మహబూబాబాద్ భగవాన్ శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వాసవీ ప్రింటర్స్‌లో షిర్డీ సాయిబాబా, సత్యసాయిబాబా చిత్రపటాలు ఏర్పాటు చేసి భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో భగవాన్ శ్రీసత్యసాయి సేవా ట్రస్టు బాధ్యులు బొడ్ల వెంకటయ్య, రామకృష్ణ, నాగేంద్ర నాగేశ్వర్‌రావు, ప్రదీప్, భువనగిరి రవీంద్రగుప్త, చౌడవరపు విద్యాసాగర్ పాల్గొన్నారు.

కథ మళ్లీ మొదటికొచ్చింది..!

నెహ్రూసెంటర్: జిల్లా వైద్యారోగ్యశాఖలో డిప్యూటేషన్లు రద్దు చేస్తూ, ఉద్యోగులంతా మదర్ పోస్టింగ్‌కు వెళ్లి పోవాలని వైద్యారోగ్యశాఖ అధికారి ఆదేశాలను జారీ చేశారు. కొంతమంది ఉద్యోగులు యథాస్థానాలకు వెళ్లిపోగా కొంత మంది ఏం జరుగుతుందోననే చూద్దామని డిప్యూటేషన్ స్థానంలోనే ఉండిపోయారు. కొన్నిసెంటర్లలో మిగిలిన ఉద్యోగులను టీంలుగా ఏర్పాటు చేస్తూ 28మందికి ఎగ్జిస్టింగ్ పోస్టులకు డిప్యూటేషన్లు ఇస్తూ డీఎంహెచ్‌ఓ ఆర్డర్స్ ఇచ్చారు. దీంతో కథ మళ్లీ మొదటి కొచ్చినట్లయింది. మారుమూల ప్రాంతాల్లో పని చేసే వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది పట్టణ ప్రాంతాలకు వచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా, వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు మారుమూల ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వెళ్లే వైద్య సేవలు నిలిచిపోతాయని ప్రజలు చెబుతున్నారు. దీనిపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిరాథోడ్‌ను వివరణ కోరగా వైద్యారోగ్యశాఖలో అత్యవసర సమయాల్లో ఉండేందుకు టీంను ఏర్పాటు చేశామని, డిప్యూటేషన్లు కాకుండా శాఖ అవసరాల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కొంత మందికి ఆర్డర్స్ ఇచ్చామని తెలిపారు.

నిప్పంటుకొని మొక్కజొన్న చేను దగ్ధం


కాలిపోయిన కంకుల కుప్ప వద్ద బాధిత రైతు

మరిపెడ రూరల్: ఓ గుర్తు తెలియని వ్యక్తి వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి పక్కనే ఉన్న మూడు ఎకరాల మొక్క జొన్న పంటకు అంటుకొని పంట మొత్తం పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని రాంపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాంపురం గ్రామానికి చెందిన దోమల వెంకటమల్లు తన వ్యవసాయ క్షేత్రంలో సాగు చేసుకున్న మూడు ఎకరాల మొక్కజొన్న పంట కోతకు వచ్చింది. కొన్ని కంకులను కుప్పగా పోశాడు. ఈక్రమంలో పక్కనే ఉన్న వరి కొయ్యలకు గుర్తు తెలియని వ్యక్తి నిప్పు పెట్టాడు. దీంతో మంటలు వ్యాపించి పక్కనే ఉన్న మొక్కజొన్న పంటకు అంటుకుంది. అక్కడే కుప్పగా పోసిన కంకులతోపాటు మూడు ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనలో రూ. 2లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వెంకటమల్లు బోరున విలపించాడు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్‌చంద్ర దగ్ధమైన పంటను పరిశీలించి, నివేదికను పైఅధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

బాధ్యతల స్వీకరణ

దంతాలపల్లి: మండల కార్యాలయంలో గురువారం తహసీల్దారుగా సునీల్‌కుమార్, ఆర్‌ఐగా రాజు బాధ్యతలు స్వీకరించారు.

జయప్రదం చేయాలి

బయ్యారం: ఈనెల 27 న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవసభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు బి.లక్ష్మణ్‌నాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని ఉప్పలపాడులో గురువారం సభను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలో దత్తభక్తులు, శ్రీదత్త హ్యూమన్ సర్వీసెస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై మురళీధర్ రాజు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సెకండ్ ఎస్సై కరుణాకర్, ఉప్పులు వంశీ పాల్గొన్నారు.

బొడ్రాయికి పూజలు

బయ్యారం: మండలంలోని కట్టుగూడెంలోని బొడ్రాయి ప్రతిష్ఠించి మూడవ వార్షికోత్సవం సందర్భంగా గురువారం గ్రామ మహిళలు బొడ్రాయికి ఘనంగా పూజలు నిర్వహించారు. అ

రూ.50వేల జరిమానా

మరిపెడ రూరల్: మరిపెడ మండలం అజ్మీరతండా గ్రామ పంచాయతీ పరిధి ఢక్నాతండాకు చెందిన బానోతు శంకర్ బైండవర్‌ను ఉల్లంఘనపై రూ.50వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి బానోతు శంకర్‌ను తహసీల్దార్ సైదులు ఎదుట మరోసారి బైండోవర్ చేసి జరిమానా విధించినట్లు తెలిపారు.

బీటీ రోడ్డుపనులను పూర్తిచేయాలి

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి నుంచి ఇనుగుర్తి వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయని, దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

మహబూబాబాద్ అర్బన్: చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని జిల్లా ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దుంపేటి లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫొటోగ్రాఫర్ అక్కోజు శ్రీనివాస్ కుమార్తె హాసిని ఇంటర్ ఎంపీసీలో 470కి 468 మార్కులు సాధించింది. గురువారం విద్యార్థిని సన్మానించారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర



కురవి: రైతులు పండించిన వరి ధాన్యానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందని గుండ్రాతిమడుగు సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి అన్నారు. గురువారం రాజోలు శివారు మండలంలోని స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జమలాపురం దీపక్, బండి శ్రీనివాస్, గుగులోతు నాగేష్, తునగర్ కృష్ణ, చిర్ర సంజీవయ్య పాల్గొన్నారు.

సభను విజవంతం చేయాలి

పెద్దవంగర: ఎల్కతుర్తిలో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య కోరారు. గురువారం మండలంలో చిట్యాల, బావోజీ తండాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాం సుధీర్, లక్ష్మీనారాయణ, హరీష్, పరమేశ్, శ్రీను పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

తొర్రూరు రూరల్: మండలంలోని నాంచారీమదూరు గ్రామానికి చెందిన మాదాటి వీరస్వామి అనే గీత కార్మికుడు రోజువారీగా గురువారం తాటి చెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో నడుము, కాళ్లు, తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో వరంగల్ ఆస్పత్రికి తరలించారు.

ఆరాధన దినోత్సవం

కురవి: మండల కేంద్రంలోని ప్రశాంతి నిలయంలో ఆరాధన దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించి వీరభద్రస్వామి ఆలయం, నాగేంద్ర స్వామి ఆలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద భక్తులకు పులిహోర, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవాసమితి మండల కన్వీనర్ సీహెచ్.శ్రీనివాస్, గండేపల్లి తిరుమలరావు-లక్ష్మీ దంపతులు, వేమిశెట్టి సంతోష్ పాల్గొన్నారు.

కష్టపడిన వారికే పదవులు ఇవ్వాలి

గార్ల: కాంగ్రెస్ పార్టీలో పదేళ్లుగా కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తలు, నాయకులను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి పదవులు ఇవ్వాలని పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ కోరారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మే డేను జయప్రదం చేయాలి

నెహ్రూసెంటర్: కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మల్లు స్వరాజ్యంనగర్‌లో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బానోత్ సీతారాంనాయక్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడకు చెందిన బీజేపీ నాయకుడు బస్సబోయిన ఉపేందర్ గురువారం డోర్నకల్ నుంచి ద్విచక్ర వాహనంపై ఉయ్యాలవాడకు వెళ్తుండగా సమ్మర్ స్టోరేజి సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడటంతో ఉపేందర్‌కు గాయాయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఖమ్మంకు తరలించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కురవి: మండలంలోని నేరడ శివారు ఎల్కచెట్టు తండా జీపీ పరిధిలోని మేఘ్యతండాలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గుగులోత్ సంధ్య గాయపడింది. ఈ మేరకు గురువారం డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తండాకు వచ్చి సంధ్యను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గుగులోత్ రవినాయక్, వీరన్న, పకీర, బాలు ఉన్నారు. అలాగే తండాలో ఇటీవల మృతి చెందిన బానోత్ కోంటి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

పాఠశాలల ఆవశ్యకతను గుర్తించాలి


మహబూబాబాద్ రూరల్: బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్: విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను గుర్తించాలని పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు అన్నారు. ముందస్తు బడిబాట కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని ఆవాస ప్రాంతాలైన సోమ్లాతండా, లక్ష్మతండా, బోడగుట్ట తండాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నట్టి రవి, బానోతు హరినాయక్, బి.గీత, రవికుమార్, ఆవారి శ్రీనివాస్, రామాచారి, రాజేష్ బాబు, పర్వతగిరి వీఓఏ సుధాకర్ పాల్గొన్నారు.

డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు గురువారం బడిబాట పట్టారు. జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం బండి నర్సింహారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, మంజులత, శ్రీనివాస్, రాంనాయక్, వసంతరాణి, రవికుమార్, జొన్నకూటి కమల పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో వాటర్‌ఫ్రిజ్ ప్రారంభం


వాటర్‌ఫ్రిజ్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ

మరిపెడ: మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ఫ్రిజ్‌ను గురువారం తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం కావడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి దాహార్తిని తీర్చేందుకు పోలీసులు చొరవ చూపడం అభినందనీయమన్నారు. అనంతరం అక్రమనల్లబెల్లం వ్యాపార చేసే వ్యాపారస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గతంలో చేసిన అక్రమ వ్యాపారాల జోలికి వెళ్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు సతీష్ గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



మరిపెడ రూరల్: మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ప్రగతి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరానికి మండలంలోని పలు గ్రామాల నుంచి కంటి రోగులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ముందుగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకులు గద్దల జాన్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రగతి సేవా సమితి ప్రోగ్రాం ఆఫీసర్ గద్దల రామ్మూర్తి, జిల్లా కోర్డినేటర్ ఐనాల పరశురాములు, శంకర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు అమర్నాథ్, శివరంగా, కోఆర్డినేటర్లు సువార్త పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



తొర్రూరు: పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అనుచరుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత డాక్టర్ పానుగోటి సోమేశ్వరరావు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. డాక్టర్ సోమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 500 మంది బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలతో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సోమేశ్వర్‌రావు, నాయకులకు పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

విద్యార్థినులకు అభినందన



మహబూబాబాద్ అర్బన్: పేద, దళిత, గిరిజన శ్రామిక వర్గాల బిడ్డలకు ప్రభుత్వ విద్యా సంస్థలు ఆక్సిజన్ వలే కాపాడుతున్నాయని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాక్కుల సదానందం అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్‌లో జిల్లా, రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థినీలను కళాశాల అధ్యాపక బృందం అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ స్వాతి, అధ్యాపకులు కుమార్, శ్రీను, రియాజ్, శ్రీనివాస్, నవీన్, సురేందర్, రవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కురవి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు కురవి ఏఎస్సై వెంకన్న గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం ఆమనగల్ గ్రామానికి చెందిన కాడబోయిన శ్రీశైలం(36) గత మార్చి నెల 1వ తేదీన కురవి మండలం నల్లెల్ల-తిర్మలాపురం గ్రామాల మధ్య బైక్ అదుపుతప్పి కిందపడిపోయి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన శ్రీశైలం మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రిలో చికిత్సపొందాడు. పరిస్థితి బాగాలేకపోవడంతో ఇంటికి తీసుకెళ్లారు. ఇంట్లోనే చికిత్సపొందుతూ శ్రీశైలం గురువారం మృతి చెందినట్లు ఏఎస్సై వెంకన్న తెలిపారు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు, పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జనరల్ ఆసుపత్రికి తరిలించినట్లు వివరించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

బొడ్డితండాలో యువకుడు..

నర్సింహులపేట: మండలంలోని బొడ్డితండాకు చెందిన గుగులోతు ప్రశాంత్(21) అనే యువకుడు పురుగుల మందుతాగి చికిత్స పొందుతు మృతి చెందాడు. ఎస్సై మాలోతు సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని బొడ్డితండాకు చెందిన గుగులోతు ప్రశాంత్ వేరే తండాకు చెందిన అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమించిన అమ్మాయి వరస కాదని తల్లిదండ్రులు మందలించారు. ఈనెల 18న ఇంట్లో ఎవరు లేని సమయంలో మనస్తాపానికి గురైన ప్రశాంత్ పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌లోని తీసుకెళ్లారు. చికిత్స పొందుతు అక్కడ మృతి చెందాడు. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్తగూడలో ఒకరు..


ప్రేమేశ్(ఫైల్)

కొత్తగూడ: రోడ్డు ప్రమాదంలో బుధవారం రాత్రి గాయపడిన గువ్వ ప్రేమేశ్(15) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై కుశకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గువ్వ ప్రేమేష్, జాల కార్తీక్‌ల తల్లి తండ్రుల పెళ్లిరోజు కావడంతో వారికి కేక్ కట్ చేయించాలని అనుకున్నారు. అందుకు కార్తీక్ మరదల్లు అయిన మౌనిక, నవ్యలను తీసుకుని కేక్ కోసం లక్ష్మీపురం నుంచి కొత్తగూడకు వెళ్తుండగా పెగడపల్లి సమీపంలో ఆటో ఢీకొన్న విషయం తెలిసిందే. మౌనిక, నవ్యలు ప్రమాద స్థలంలోనే మృతి చెందగా ప్రేమేష్, కార్తీక్‌లను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రేమేశ్ మృతి చెందాడు. ములుగు మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, కుసుమాంజలి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సర్వీసు వైరు దొంగ అరెస్ట్

నెల్లికుదురు: వ్యవసాయ మోటార్ల సర్వీసు వైరు దొంగ దొరికినట్లు ఎస్సై చిర్ర రమేశ్‌బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. నెల్లికుదురు క్రాస్ రోడ్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్నట్లు తెలిపాడు. అతడిని పట్టుకుని వివరాలు అడుగగా మండల కేంద్రానికి చెందిన కూతాటి ప్రసాద్ అని తెలిపాడు. అతని వద్ద సర్వీసు వైరు ఉన్నట్లు గుర్తించారు. మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి ఆకేరు వాగు వెంబడి రైతుల మోటార్లకు ఉన్న విద్యుత్ సర్వీసువైరు దొంగిలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ



కురవి: రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ సమావేశం బి.ప్రభేష్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెలలో శాఖ మహాసభలను నిర్వహించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మరిపెడ ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డిని పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో నల్లు సుధాకర్‌రెడ్డి, నెల్లూరు నాగేశ్వర్‌రావు, రాజన్న, బాలకృష్ణ, తురక రమేష్, పోలేపాక వెంకన్న, బుర్ర సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.